ప్రజాశక్తి
బుధవారం 24 సెప్టెంబర్ 2025 5 అనంతపురం



## యాడికి కాలువకు నీరు విడుదల


ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పెద్దవడుగూరు సమీపంలో ఉన్న యాడికి కాలువ రెగ్యులేటర్ వద్ద తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకరరెడ్డి మంగళవారం జలహారతి ఇచ్చి నీరు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు కేశవరెడ్డి, దివాకరరెడ్డి, గంగరాజు, నాగేశ్వరరెడ్డి, హరినాథరెడ్డి, తెలివికి శ్రీరాములు, ఆరెకటిక రాష్ట్ర ఛైర్మన్ హరికృష్ణారావు, యాడికి మండల మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, శరణ్, రుద్రమనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



నీటిని విడుదలను పర్యవేక్షిస్తున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

# అరకొర కూడా నాసిరకమే..!



జిల్లాలో యూరియా కోసం రైతుల అవస్థలు కొనసాగుతూనే ఉన్నాయి. 'పంట ఎండిపోతోంది ఒక్క బస్తా యూరియా అయినా ఇప్పించండి సారూ' అంటూ అన్నదాతలు వేడుకుంటున్నారు. రైతులు రోజుల తరబడి ఎదురు చూస్తే ఒకటి, రెండు బస్తాల యూరియా ఇస్తున్నారు. ఆర్ఎస్‌కెల్లో ఇచ్చిన యూరియా కూడా నాశిరకంగా ఉండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇచ్చేందే అరకొర అదీ నాశిరకమేనా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఎర్ర రంగులో గడ్డలు కట్టిన యూరియా

- ఆర్ఎస్‌కెల్లో నాసిరకం యూరియా
- ఎర్రగా గడ్డలు కట్టిన బస్తాలు
- లబోదిబోమంటున్న రైతులు
- యూరియా పంపిణీ లెక్కలు వెల్లడించని యంత్రాంగం

**నాణ్యతలేని యూరియా**

కళ్యాణదుర్గం వ్యవసాయడివిజన్‌లో ఆర్ఎస్‌కెల ద్వారా రైతులకు నాణ్యతలేని యూరియాను అంటగట్టినట్లు బాధిత రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న రాష్ట్రీయ కెమికల్ ఫర్టిలైజర్స్ (ఆర్‌సీకే) పేరుతో అందజేసిన బస్తాలలో ఏమాత్రం నాణ్యతలేన్నట్లు కనిపిస్తోంది. ఆర్ఎస్‌కెల్లో ఆర్‌సీకే బస్తాలలో యూరియాను పరిశీలిస్తే ఎర్రగా, నల్లగా, గడ్డలుకట్టి బస్తాను తాకడానికి కూడా వీలులేనంత దారుణంగా ఉంది. ఈ బస్తాలు విప్పిచూసిన రైతులు నాణ్యతలోపాన్ని చూసి విస్తుపోతున్నారు. యూరియా అందిందని సంతోషపడాలో, నాణ్యతలేనిది ఇచ్చినందుకు బాధపడాలో తెలియక రైతులు సతమతం అవుతున్నారు. నాణ్యతలేని యూరియాను ఉపయోగించినా ఫలితం ఉండదని రైతులు చెబుతున్నారు.

**కళ్యాణదుర్గం డివిజన్‌లో యూరియా సరఫరా ఇలా..**

| మండలం | ఆర్ఎస్‌కేలు | యూరియా వచ్చిన ఆర్ఎస్‌కేలు | సరఫరాచేసిన యూరియా |
|---|---|---|---|
| కళ్యాణదుర్గం | 18 | 03 | 560 |
| కంబదూరు | 14 | నిల్ | నిల్ |
| కుందుర్పి | 16 | 03 | 60 |
| శెట్టూరు | 13 | 02 | 560 |
| బ్రహ్మసముద్రం | 13 | 06 | 1540 |
| బెళుగుప్ప | 14 | 06 | 1680 |
| **మొత్తం** | **88** | **20** | **5300** |

**యూరియా కోసం రెండు నెలలుగా పడిగాపులు**

అనంతపురం జిల్లాలోని ఆరు వ్యవసాయ డివిజన్‌లలో యూరియా కోసం రెండునెలలుగా రైతులు పడుతున్న అవస్థలు అన్నీఇన్ని కావు. ప్రధానంగా మొక్కజొన్న, వరి, అరటి పంటలు సాగుచేసిన రైతులకు యూరియా వాడకం అత్యంత అవసరం. ఈ నేపథ్యంలో యూరియా కోసం రైతులు ప్రయివేటు ఎరువుల డీలర్లు, వివిధ కంపెనీల దుకాణాల వద్ద పడిగాపులు కాశారు. ఇప్పటికీ అది కొనసాగుతోంది. రైతులు ఆర్ఎస్‌కెల్లో యూరియా తీసుకోవాలని వ్యవసాయాధి కారులు, ప్రజాప్రతినిధులు చేస్తున్న ప్రకటనల్లో ఏమాత్రం వాస్తవం లేకుండాపోయింది. కొన్ని ఆర్ఎస్‌కెలకు అరకొరగానే యూరియా వచ్చింది. కొరత కారణంగా రెండు బస్తాలు ఇవ్వాలని అధికారులు చెబుతున్నా ఒక్కొబస్తానే పంపిణీచేసి చేతులు దులుపుకున్నారు.



**పంపిణీపై పొంతన లేని లెక్కలు**

అనంతపురం జిల్లాలోని ఆరు వ్యవసాయ డివిజన్‌లలో 435 రైతుసేవా కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాలకు ఎన్ని బస్తాల యూరియా సరఫరాచేశారు.. ఎంతమంది రైతులకు పంపిణీ జరిగిందనేది వ్యవసాయశాఖ, మార్కెట్ అధికారులు గోప్యంగా ఉంచడంతోపాటు ఎవరైనా సమాధానమడిగితే దాటవేతదోరణి వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



**యూరియా బాగాలేదు**

రైతుసేవా కేంద్రంలో ఇటీవల తీసుకున్న యూరియా ఏమాత్రం బాగాలేదు. ఎర్రగా, నల్లగా, గడ్డలుకట్టి బస్తాముట్టులేని విధంగా ఉంది. విప్పి చూస్తే యూరియాపై అనుమానం ఉంది. గతంలో కొన్న యూరియాకు, ఇప్పుడు ఇచ్చిన యూరియాకు తేడా ఉంది. ఇది పంటలకు ఉపయోగ పడుతుందో లేదోనని అనుమానం పడుతున్నాం. బస్తాలపై వివరాలుకూడా సరిగాలేవు.

**చాముండమ్మ, మహిళారైతు, బోరంపల్లి.**



**నాణ్యతలో లోపం వుండదు**

ఆర్ఎస్‌కెలలో పంపిణీచేసిన యూరియా నాణ్యతలో ఎలాంటి లోపం ఉండదు. అన్ని నిబంధనల మేరకు సిద్ధంచేసిన యూరియాను సరఫరా చేశాం. రంగు స్వభావంలో తేడాలు ఉన్నంతమాత్రాన నాణ్యతలోపం కాదు. ఈ విషయంలో రైతులెవ్వరూ అపోహలకు లోనుకావద్దు.

**యల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం.**

## హెచ్‌ఐవి బాధితులకు చికిత్స అందించాలి

### కలెక్టర్ ఓ.ఆనంద్



ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో హెచ్‌ఐవితో జీవిస్తున్న వారందరికీ చికిత్స అందించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ మీటింగ్ హాల్‌లో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి అంచనాల ప్రకారం జిల్లాలో హెచ్‌ఐవితో జీవిస్తున్న వారిని గుర్తించేందుకు ప్రణాళికలు రూపొందించి, గుర్తించిన వారందరినీ ఎఆర్‌టి కేంద్రాల్లో నమోదయ్యేలాగా ప్రోత్సహించి చికిత్స అందించాలని ఆదేశించారు. చికిత్స తీసుకోవడం ద్వారా వారిలో హెచ్‌ఐవి వైరస్ నియంత్రించవచ్చన్నారు. దీనికితోడు వ్యాధి నిరోధక శక్తి పెరిగి హెచ్‌ఐవి మందులు వాడేవారు ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా ఉంటారని వివరించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఇబి దేవి జిల్లాలో హెచ్‌ఐవి నియంత్రణకు వైద్య, ఆరోగ్య శాఖ చేపడుతున్న కార్యక్రమాలను, జిల్లాలో అందుబాటులో ఉన్న సదుపాయాలను కమిటీ సభ్యులకు వివరించారు. జిల్లా పరిషత్ సిఇఒ శివశంకర్ మాట్లాడుతూ కళాశాల యువతకు హెచ్‌ఐవిపై ఎక్కువగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ జయలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు, ఇన్‌ఛార్జి డిసిహెచ్‌ఎస్ యల్లప్ప, ప్రభుత్వ వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.రేణుక, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నీలిమ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, డెమో త్యాగరాజు, యువజన శాఖ అధికారి శ్రీనివాసులు, డిప్యూటీ విద్యాధికారి బి.శ్రీనివాసులు, అనంత నెట్‌వర్క్ ప్రతినిధులు, రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కిష్టప్ప, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు

## తుతూమంత్రంగా పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పంచాయతీ అభివృద్ధి సమావేశం తూతూమంత్రంగా సాగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా పంచాయతీ సమావేశానికి మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు హాజరుకావాలి. అయితే అందుకు భిన్నంగా 21 పంచాయతీలకు సంబంధించిన పలువురు ప్రజాప్రనిధులు హాజరుకాకపోవడం గమనార్హం. అయితే ప్రజాప్రతినిధులకు సరైన సమాచారం ఇవ్వలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో సమస్యలు తాండివిస్తున్న సమయంలో పంచాయతీ అభివృద్ధి సమావేశం తూతూమంత్రంగా సాగడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీ అభివృద్ధి సమావేశం సక్రమంగా సాగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సమావేశం లో కాళీ గా దర్శనం ఇస్తున్న కుర్చీలు

## రాయదుర్గం ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగుపరచండి

### అసెంబ్లీలో విప్ కాలవ శ్రీనివాసులు



ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగుపరచాలని విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. మంగళవారం రాష్ట్ర శాసనసభలో రాయదుర్గం ప్రభుత్వ వైద్యశాల పరిస్థితిపై విప్ వివరించారు. గత టిడిపి ప్రభుత్వం హయాంలో కామినేని శ్రీనివాసరావు వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్నప్పుడు వంద పడకల ఆసుపత్రిగా మార్చారని తెలిపారు. అందుకు అనుగుణంగా అదనపు భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించారన్నారు. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం ఆస్పత్రి గురించి పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా అసంపూర్తిగా ఉన్న భవనాలు పూర్తి చేయాలని విన్నవించారు. ఆసుపత్రికి 22 మంది వైద్యులను కేటాయించగా ప్రస్తుతం కేవలం ఆరుగుతు మాత్రమే ఉన్నారన్నారు. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులు త్వరగా భర్తీ చేయటంతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

## విద్యుత్ ప్రమాద బాధితునికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి-రాప్తాడు

మండలంలోని హంపాపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 20వతేదీ జరిగిన ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మన్నీల రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బెంగాల్‌కు చెందిన కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు పుష్పరాజు, బ్రహ్మయ్య, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

## ప్రాణం తీసిన అప్పు

### కంతులు కట్టలేక తనువు చాలించిన లారీ డ్రైవర్

ప్రజాశక్తి-గుత్తి

రెక్కలకష్టం చేసుకుని కుటుంబాన్ని పోషించుకోవాలకున్న ఆయన్ను అప్పులు వెంటాడాయి. ఎంత కష్టం చేసినా కనీసం కంతులు చెల్లించేందుకు కూడా డబ్బులు లేక నిత్యం కష్టాలను చవిచూశాడు. ఈనేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుని తణువు చాలించాడు. ఈ విషాద ఘటన గుత్తిలో చోటు చేసుకుంది.



ఆత్మహత్య చేసుకున్నఈశ్వరరావు

వివరాల్లోకి వెళ్తే.. ఆర్థిక సమస్యలతో ఉరేసుకుని ఓ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం గుత్తిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ కాలనీలో నివాసం ఉండే ఈశ్వరరావు (48) లారీ డ్రైవర్ పని చేస్తూ జీవనం కొనసాగించేవాడు. కొన్ని నెలల క్రితం ఓ ప్రయివేట్ ఫైనాన్స్ సంస్థలో రుణం కింద లారీని కొనుగోలు చేశాడు. అయితే బాడుగలు లేక ఫైనాన్స్ కంపెనీకి నెలసరి కంతులు కట్టలేకపోయాడు. దీంతో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు లారీని తీసుకెళ్లారు. దీనికితోడు కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చలేక ఉన్న లారీని ఫైనాన్స్ కంపెనీ తీసుకెళ్లడంతో మనస్థాపానికి గురైన ఈశ్వరరావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతునికి భార్య, పిల్లలు కలరు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## గ్రామ వ్యవసాయ సహాయకుడి చేతివాటం..!

- రైతులతో డబ్బులు కట్టించుకుని పరార్
- రూ.10,01,320 నగదు స్వాహా చేసినట్లు సమాచారం
- పోలీసులకు బాధిత రైతుల ఫిర్యాదు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

బాధ్యతగా విధులు నిర్వహించాల్సిన ఓ సచివాలయ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించారు. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందిస్తానని రైతులకు చెప్పి గ్రామ వ్యవసాయ సహాయకుడు వారితో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశాడు. రైతులతో తీసుకున్న సొమ్ము ప్రభుత్వానికి జమ చేయకుండా తన సొంతానికి వాడుకుని, ఆపై తప్పించుకుని తిరుగుతున్నాడు. మోసపోయామని గ్రహించిన రైతులు మోసం చేసిన బ్రహ్మసముద్రం మండలం కన్నెపల్లి గ్రామ సచివాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకుడుగా విధులు నిర్వహిస్తున్న విద్యాసాగర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధిచి బాధిత రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...

బ్రహ్మసముద్రం మండలం కన్నెపల్లి గ్రామ సచివాలయంలో విద్యాసాగర్ గ్రామ వ్యవసాయ సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన కన్నెపల్లి, ముద్దలాపురం, గుడిపల్లి, బుడిమేపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతుల వద్ద యూరియా, వేరుశనగ, డ్రిప్ పైపులు, పివిసి పైపులు, వ్యవసాయ యంత్రాలైన ట్రాక్టర్, రోటివేటర్, టిల్లర్లు వివిధ రాయితీ పరికాలు ఇప్పిస్తానని నమ్మబలికి లక్షల్లో డబ్బులు తీసుకున్నాడు. బుడిమేపల్లి గ్రామానికి చెందిన 13 మంది రైతుల నుంచి రూ.4,03,250, గుడిపల్లి గ్రామంలో 23 మంది నుంచి రూ.3,23,070, ముద్దలాపురంలో ఐదుగురు నుంచి రూ.1,25,000, కన్నేపల్లిలో ఐదుగురు నుంచి రూ.1,50,000, ఇలా 46 మంది రైతుల నుంచి సుమారు రూ.10,01,320 నగదును తీసుకున్నారు. సదరు ఉద్యోగి రైతుల నుంచి తీసుకున్న నగదును ఏపీ సీడ్స్‌కు జమ చేయకుండా సొంత ఖర్చులకు వాడినట్లు తెలుస్తోంది. డబ్బులు ఇచ్చిన రైతులు పలుమార్లు ఆయన్ను అడిగినా పొంతలేని సమాధానం ఇస్తూ వచ్చాడు. ప్రస్తుతం ఆయన కన్పించకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. మోసపోయామని తెలుసుకున్న రైతులు మంగళవారం నాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆగస్ట్, సెప్టెంబర్ నెలలకు సంబంధించిన సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ చేసి అనంతరం మిగిలిన రూ.80వేలను కూడా ప్రభుత్వ ఖాజానాకు జమచేయనట్లు తెలుస్తోంది. దీనిపై కూడా పంచాయతీ కార్యదర్శి యోగేష్ విద్యాసాగర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**గతంలోనూ స్వాహా పర్వం**

గతంలో పడమటి కోడిపల్లి గ్రామ సచివాలయ కేంద్రంలో అప్పట్లో విధులు నిర్వహిస్తున్న వరుణ్ (ప్రస్తుతం బదిలీ) వేరుశనగ విత్తనాల కోసం రైతుల నుంచి రూ.3.69లక్షలు తీసుకుని ప్రభుత్వానికి చెల్లించకుండా సొంతానికి వినియోగించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో ఆయన రూ.1.60లక్షలు ప్రభుత్వానికి చెల్లించినట్లు సమాచారం. ఇంకా రూ.2.90 లక్షలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. బాధ్యతగా విధులు నిర్వహించాల్సిన సచివాలయ సిబ్బంది ఇలా రైతుల డబ్బులను కాజేసి వెళ్లడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నతాధికారులు ఈ ఘటనలపై పూర్తి స్థాయి విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.

ఈ విషయంపై వ్యవసాయ అధికారి గోపాల్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా బాధిత రైతులు తమ దగ్గరకు వచ్చి ఫిర్యాదు చేయలేదన్నారు. తమ వద్ద ఉన్న సమాచారాన్ని జిల్లా అధికారులకు పంపనున్నట్లు తెలియజేశారు.

## న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

### అఖిల భారత న్యాయవాదుల సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు న్యాయవాదుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిల భారత న్యాయవాదుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురం బార్ అసోసియేషన్‌లో జిల్లా అఖిలభారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదుల సమస్యలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.గురుప్రసాద్, ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ సభ్యులు రామిరెడ్డి, ఐలు గౌరవాధ్యక్షులు సితారామరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆల్ ఇండియా లాయర్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐలు అధ్యక్ష, కార్యదర్శులు వీరమాసప్ప, సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, జిసి ప్రకాష్, కమిటీ సభ్యులు కరిమల గిరి, అశోక్, చంద్రశేఖర్, మల్లేష్, జూనియర్ న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.




పోస్టర్లను విడుదల చేస్తున్న న్యాయవాదులు

## ఆర్డీటీతో వైసిపి రాజకీయం

### ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఆర్డీటీ సంస్థని అడ్డం పెట్టుకుని వైసిపి రాజకీయాలు చేస్తోందని, వాటిని ప్రజలు ఎవరూ నమ్మొద్దని ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఆర్డీటీ సమస్యపై జిల్లాకు చెందిన మంత్రి సవితమ్మ, విప్ కాలువ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరరెడ్డి, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌ను కలిసి చర్చించారు. ఈసందర్భంగా ఆర్డీటీ సమస్యలపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సంప్రదింపులు చేశామని లోకేష్ వివరించారు. అలాగే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదనిలోకేష్ హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద నాయకులు మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ ఉమ్మడి అనంతపురం జిల్లాకు జీవనాడి లాంటిదన్నారు. జిల్లాలో లక్షలాది మందికి విద్య, వైద్యం, గృహ నిర్మాణాలు, వ్యవసాయంలో ఆర్డీటీ సంస్థ చేయూతనందిస్తోంద న్నారు. ముఖ్యంగా వైద్యసేవలు ఎంతో మందికి ఉపయోగపడుతున్నాయన్నారు. ఇలాంటి సున్నితమైన అంశంపై గత కొన్ని రోజులుగా వైసీపీ రాజకీయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల్ని రెచ్చగొడుతూ రోడ్లపై వచ్చేలా చేయాలని చూస్తోందన్నారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని.. ఆర్డీటీని కాపాడే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుందని స్పష్టం చేశారు.



మంత్రి లోకేష్‌తో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేలు

## ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోండి

### జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-గుత్తి

పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని జక్కలచెరువు గ్రామంలో గుత్తి డివిజన్ ఎడిఎ ఎం.వెంకటరాముడుతో కలిసి పత్తి పొలాలను పరిశీలించారు. ఇందులో భాగంగా రైతు నాగరాజు పత్తి పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జెడిఎ ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ గుత్తి మండలానికి 30 టన్నుల జిప్సమ్ వచ్చిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ప్రతి రైతు పంటలను ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. పత్తి పంటలకు ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణకు ప్రతిరైతు ఎరువులు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. అనంతరం గ్రామ శివారులోని వేరుశనగ, కంది, ఆముదం, సజ్జ ఇతర పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్, టెక్నికల్ ఎఒ శశికళ, రైతులు పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న జెడిఎ ఉమామహేశ్వరమ్మ

**అనంతపురం :** అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి, మన్నీల గ్రామాల రైతు సేవ కేంద్రం పరిధిలో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎ.వెంకట్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి బి.మురళీకృష్ణ, రైతు సేవాకేంద్రం సిబ్బంది అపర్ణ, జై చంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికులపై వేధింపులు ఆపాలి

## గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు గోపాల్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

గ్రామ పంచాయతీ కార్మికులపై స్థానిక అధికార పార్టీ నేతలు పాల్పడుతున్న వేధింపులు అక్రమ తొలగింపులు ఆపాలని గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ డిమాండ్ చేశారు. తొలగించిన రుద్రం పేట గ్రామ పంచాయతీ కార్మికుడు వెంకటరాముడును తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. రుద్రంపేట బైపాస్ సర్కిల్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుద్రంపేట గ్రామపంచాయతీలో అధికార పార్టీ నాయకులు కార్మికులపై వేధింపులకు గురి చేస్తున్నారని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని తాము చెప్పిన మాట వినకపోతే అక్రమంగా తొలగిస్తున్నారని తెలిపారు. కార్మికులపై పెత్తనం చేయడానికి తమ మనుసుల్ని ఏర్పాటు చేశారని, అధికారం చేపట్టడానికి కార్మికుల ఓట్లు కావాలని, వారి సమస్యలు మాత్రం మీకు పట్టవా అంటూ మండిపడ్డారు. తొలగించిన కార్మికుడిని విధుల్లోకి తీసుకునేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, ఆటో యూనియన్ కార్యదర్శి ఎన్టీఆర్ శ్రీనివాసులు, ఆటో యూనియన్ అధ్యక్షులు ఆజాం బాషా, కోశాధికారి ఆదినారాయణ, పంచాయతీ యూనియన్ నాయకులు బాషా, చంద్ర, వేణు, మూర్తి, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

# గృహ నిర్మాణాలపై సమీక్ష

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

అనంతపురం అర్బన్‌కు కేటాయించిన లేఔట్‌లలోని గృహ నిర్మాణాలపై మంగళవారం స్థానిక కౌన్సిల్ హాలులో గృహ నిర్మాణ శాఖ సచివాలయం ప్లానర్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆప్షన్ 1, 2 కింద 11,318 ఇళ్లు మంజూరు కాగా 2338 ఇళ్లు పూర్తి చేశారని తెలిపారు. నిర్మాణ దశలో 2,558 ఇళ్లు ఉన్నాయని, ఆప్షన్ -3 కింద 7,331 ఇళ్లు మంజూరు కాగా 2,507 ఇళ్లు పూర్తి చేశారని తెలిపారు. నిర్మాణ దశలో 4,814 ఇళ్లు ఉన్నాయని హౌసింగ్ అధికారులు వివరించారు. నిర్మాణదశలో ఉన్న ఆప్షన్ 1, 2 (2558), ఆప్షన్-3 కింద (4814) ఇళ్లు నిర్మాణదశలో ఉన్నాయని నిర్ధారించారు ఈ నిర్మాణదశలో ఉన్న 7372 ఇళ్లను ఇకపై వార్డ్ అమినిటీ కార్యదర్శులు వారి పరిధిలో ప్రతి వారంలో నాలుగు ఇళ్లు పూర్తి చేయాల్సి ఉందని కమిషనర్ సూచించారు. అలాగే పిఎంఎవో 2.0 కింద 443 ఇళ్లు రూ.2.50 లక్షలు యూనిట్ కాస్ట్ వారీగా మంజూరైన ఇల్లు ప్రతి వార్డు అమినిటీ సెక్రటరీ వారి పరిధిలో పరిశీలించాలని తెలిపారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ ఎస్ఇ రాజశేఖర్, హౌసింగ్ సహాయక ఇంజినీర్లు శివారెడ్డి, జమీల్, సిఎల్‌టిసిలు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

# వెస్ట్‌జోన్ ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు ఆర్ట్స్‌కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థి

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

అక్టోబర్ 31 నుంచి నవంబర్ 9వ తేది వరకు గుజరాత్ రాష్ట్రంలోని పఠాన్ నగరంలో నిర్వహిస్తున్న వెస్ట్‌జోన్ ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల బిబిఎ ద్వితీ సంవత్సరం చదువుతున్న విద్యార్థి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ పి.అజయ్‌కుమార్ ఎంపిక అయ్యారని కళాశాల ప్రన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాలలోని ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో ఎంపికైన విద్యార్థిని అభినందించారు. ఈ ఎంపిక ప్రక్రియలో పరుగు, మార్చ్‌పాస్ట్, సాంస్కృతిక కార్యక్రమలలో ఉత్తమ ప్రదర్శన కనబరచినందుకు విద్యార్థి అజయ్‌కుమార్ ఎంపిక అయ్యారని తెలిపారు. అజయ్ కుమార్ గత సంవత్సరం రోజులుగా ఎన్నో ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమలలో చురుకుగా పాల్గొన్నారని, ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం కురుగుంట 2024 సంవత్సరంలో నిర్వహించారని తెలిపారు. ఈ స్పెషల్ క్యాంపులో రోడ్డు బధ్రతా నియమావళి, సైబర్ క్రైమ్ పైనా ప్రజలకు అవగాహన కల్పించి ఎం.పి. అంబిక లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ప్రశంసలు పొందారని తెలిపారు. చెట్లు నాటడం, స్వచ్ఛ భారత్, మట్టి వినాయకుల పంపిని, రెండు సార్లు రక్తదానం చేశారని, పర్యవరణ పరిరక్షణపై అవగాహన, మాదకద్రవ్యాల దుష్ప్రభావలాపై అవగాహన, ఎన్నో ఆరోగ్య శిబిరాలు, ప్లాస్టిక్ పరిశ్రమలపై అవగాహన, స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు, దివ్యాంగులకు ఎన్నో సేవలను అందించాడని తెలిపారు. ఈ కార్యక్రమములో అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.విష్ణు ప్రకాష్, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ టి.జితేంద్ర, ఎన్ఎస్ఎస్ పిఒ ఎం.విష్ణుప్రియ, డాక్టర్ ఎం.బాలాజీ నాయక్, నాగభూషణ, డాక్టర్ బందా, శ్రీనివాసులు, నాగార్జున, సుగప్ప, బిబిఎ ఇన్‌చార్జి జి.శేఖర్, మంజునాథ్, లెక్చరర్లు, ఎన్‌సిసి సిటిఓ రామాంజినేయులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్

# ఆలయాల పునర్ నిర్మాణాలకు సహకారం అందించండి

## మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఎమ్మెల్యే దగ్గుపాటి వినతి

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

అనంతపురంలోని ఆలయాల పునర్నిర్మాణం, ఇతర సౌకర్యాల కల్పనకు సహకారం అందించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంగళవారం అసెంబ్లీలోని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఛాంబర్‌కు ఎమ్మెల్యే వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయాల వివరాలను మంత్రికి అందజేశారు. ముఖ్యంగా నగరంలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర-కోదండరామ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.4.50 కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం మొత్తం అంచనా వ్యయంలో 20శాతం దాతల సహకారం తీసుకోవాలని ఉందని.. అయితే అంత మొత్తంలో దాతల నుంచి సమకూరే అవకాశం లేదన్నారు. అందుకే దాతల సహకారాన్ని దయచేసి 10 శాతం తగ్గించాలని కోరారు. మిగిలిన 90 శాతానికి సంబంధించి పూర్తి అంచనా వ్యయాన్ని కామన్ గుడ్‌ఫండ్ నుంచి మంజూరు చేయాలని అభ్యర్థించారు. దీనిపై మంత్రి రామనారాయణరెడ్డి సానుకూలంగా స్పందించారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

# అనారోగ్యంతో విఆర్ఎ మృతి

**ప్రజాశక్తి-గుత్తి**

మండలంలోని శ్రీపురం గ్రామ రెవెన్యూ సహాయకుడు ఓబులేసు (58) అనారోగ్యంతో సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఓబులేసు గత కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు మూడు రోజుల క్రితం ఓబులేసును చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక పరిస్థితి విషమించి మతి చెందాడు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహశీల్దార్ కె.సూర్యనారాయణ ఓబులేసు స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


విఆర్ఎ ఓబులేసు (పాతచిత్రం)



# బధిరుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## కలెక్టర్ ఓ.ఆనంద్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

బధిరుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బధిరుల, సైన్ లాంగ్వేజ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినికిడి లోపం అనేది ఒక బలహీనత కాదని అది ఒక ప్రత్యేకమైన జీవనశైలిగా గుర్తించాలన్నారు. మనలాగే కలలు, ఆశయాలు, సామర్థ్యాలు కలిగి ఉంటారని, సైగల బాష ద్వారా వారు తమ భావాలను, ఆలోచనలను వ్యక్తపరచగలరని తెలిపారు. బధిరులను ఆత్మీయంగా పలకరించే క్రమంలో సైగల భాషను నేర్చుకోవడం ద్వారా వారితో మరింత సులువుగా ఉండవచ్చన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమాజంలో వినికిడి లోపం ఉన్న వారిని అన్ని విధాల ఆదుకునేందుకు విరివిగా అవకాశాలు కల్పిస్తోందన్నారు. విద్య, ఉద్యోగం, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలలో ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. బదురుల సంక్షేమం కోసం జిల్లాలో ఇప్పటి వరకు 45 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామన్నారు. 6,707 మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. బధిరులు మనోధైర్యంతో ముందుకు సాగుతూ అన్నిరంగాల్లోనూ విజయం సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభా వంతుల ఛైర్మన్ గడుపుటి నారాయణ స్వామి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి అర్చన, సర్వశిక్ష అభియాన్ పీడీ శైలజ, ఆర్‌డిటిసి ప్రతినిధి రఫీ, పలువురు బదిరుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు లక్ష్మీనరసింహ, రాఘవేంద్ర, రహంతుల్లా, శ్రీరాములు, ప్రిన్సిపాల్ ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఓ.ఆనంద్

# రాజీవ్‌కాలనీలో అభివృద్ధి పనులు చేయాలి

## సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

అనంతపురం అర్బన్ పరిధిలోని రాజీవ్‌కాలనీ పంచాయతీలోని కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని, ప్రజల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో రాజీవ్‌కాలనీ పంచాయతీ కార్యాలయాన్ని సిపిఎం నాయకులు, ప్రజలు మంగళవారం ముట్టడించారు. కార్యాలయంలోకి ఎవరని వెళ్లనీయకుండా బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో డ్రెయినేజ్ సరిగా లేదన్నారు. స్థానిక సర్పంచ్, అధికారులు అడిగితే పంచాయతీ కార్మికులు తక్కువగా ఉన్నారు ఇంకా కార్మికుల పెంచుకోవాలి అంటున్నారని తెలిపారు. వీధిలైట్లు సరిగా లేవన్నారు. అక్కడక్కడ లైట్లు లేక చీకటిమయంగా ఉందన్నారు. దోమలు వ్యాపించి సీజనల్ వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే డ్రెయినేజీ శుభ్రం చేయాలన్నారు. లైట్లు వేయాలన్నారు. నేతాజీ నగర్‌లో సిమెంట్ రోడ్డు వేయాలన్నారు. డ్రైనేజ్ కూడా అక్కడ సరిగా లేదన్నారు. మహదేవ్ నగర్, గణేనాయక్ కాలనీ, లీలమ్మ కాలనీ, ముత్యాలమ్మ కాలనీల్లో ఇదే సమస్యలు నెలకొన్నాయని దీంతో ఈ కాలనీలు అభివద్ధికి దూరంగా ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రాజీవ్ కాలనీ పరిధిలో ఆగిన రోడ్ల పనులు, డ్రైనేజ్ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎస్.మసూద్, నగర నాయకులు వలి, వెంకట నారాయణ, ఇర్ఫాన్, జీవరత్నం, పార్టీ సభ్యులు వెంకటప్ప, రాము, శ్రీనివాసులు, గౌస్, చాంద్ బాషా, బాషా, రవి, పవన్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

# బలవంతపు భూ సేకరణ ఆపాలి

## నేడు విజయవాడలో ధర్నా - రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు

**ప్రజాశక్తి-బెలుగుప్ప**

జిల్లాలో బలవంతపు భూసేకరణ ఆపాలని, 2013 భూసేకరణ చట్టం అమలు చేసి రైతులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లాసహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సోలార్ పేరుతో జరుగుతున్న భూసేకరణ రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. సోలార్ కంపెనీలు భూమి కొనుగోలు సందర్భంగా పెడుతున్న నిబంధనలు రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. 30ఏళ్ల లీజు ఒప్పందం వల్ల రైతు దీర్ఘకాలంలో భూమిపై హక్కు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రైతుల నుంచి భూములు తీసుకున్న సోలార్ కంపెనీ ఆ భూములను బ్యాంకులో తనఖా పెట్టి పెద్దమొత్తంలో రుణం తీసుకుని బ్యాంకుకు తిరిగి చెల్లించకపోతే ఆ భూమిపై రైతు హక్కు కోల్పోతాడన్నారు. రైతుకు సోలార్ కంపెనీకి వివాదం వస్తే కోర్టుకు వెళ్లాలంటే సోలార్ కంపెనీ కార్పొరేట్ సిటీలో ఉండే కోర్టులోనే కేసు వేయాలనే నిబంధన ఉందన్నారు. ఇది పూర్తిగా రైతుకు వ్యతిరేకమన్నారు. రైతు నివాసం ఉన్న తాలూకా పరిధిలోనే ఉండే సివిల్ కోర్టులో పరిష్కరించుకునే అవకాశం ఉండాలన్నారు. లీజు ఒప్పందం పదేళ్లకు దాటకుండా ఉండాలన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు కౌలు 30 శాతం అదనంగా కలిపి ఇవ్వాలన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24వతేదీన విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాకు రైతులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు.



# ఆదాయ పన్నుల వివరాలు పారదర్శకంగా ఉండాలి

**ప్రజాశక్తి-గుంతకల్లు**

ఆదాయపు పన్ను వివరాలు (ఐటి రిటర్న్‌లు) అందించడంలో వ్యాపారులు పారదర్శకత ఉండాలని ఆదాయ పన్ను శాఖ అధికారి కిరణ్‌కుమార్ సూచించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో స్థానికవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉన్న ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా 'వ్యాపారులు ఖాతాలు ఎలా నిర్వహించాలి, ఆదాయ పన్ను కొత్త చట్టాలు' అనే అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటి రిటర్న్ ఇవ్వడంలో పారదర్శకత పాటించాలన్నారు. బ్యాంకు ఖాతాలపై ఐటీ శాఖ నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ఒకవేళ ఐటీ రిటర్న్ ఇవ్వడంలో పొరపాట్లు ఉంటే భారీ జరిమానాలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ పాన్ కార్డుకు ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ఆధార్‌కు పాన్ కార్డు అనుసంధానం కోసం కేవలం రూ.వెయ్యి మాత్రమే రుసుం వసూలు చేస్తోందన్నారు. చిన్న వ్యాపారులు తాము ఐటి రిటర్న్ పరిధిలో లేమని నిర్లక్ష్యం చేయరాదన్నారు. తప్పనిసరిగా పాన్‌కార్డుకు ఆధార్‌కార్డు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ ఇండస్ట్రీస్ పట్టణ అధ్యక్షులు గోపా జగదీష్, ఆర్యవైశ్య సంఘం పట్టణ కార్యదర్శి కందూరి కృపాకర్, వ్యాపారులు, ఆడిటర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐటి అధికారి కిరణ్‌కుమార్

# 13 గంటల పనివిధానాన్ని ఉపసంహరించాలి

## సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజినేయులు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

కార్మికులు, ఉద్యోగులు 8 గంటల నుంచి 13 గంటలు పని చేసేలా రాష్ట్ర అసెంబ్లీలో చేసిన నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మన్నీల రామాంజినేయులు డిమాండ్ చేశారు. 13 గంటల పని విధానం ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సోములదొడ్డి వద్ద ఐఎంఎల్ డిపో వద్ద హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలకు దాసోహం అయ్యి కార్మికులకు నష్టం చేసేలా పని గంటలు పెంచడం దుర్మార్గంగా ఉందన్నారు. మహిళలు రాత్రిపూట డ్యూటీలు చేయాలని, 13 గంటల పని చేసేలా అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మోహన్ రెడ్డి, రాజు, పుష్పరాజు, నాగార్జున, మారుతి, మోహన్ బాబు, పెద్దన్న, నల్లప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

# దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వండి

## ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జె.పద్మావతి

**ప్రజాశక్తి-గుంతకల్లు**

ప్రతి ఒక్కరూ దేశ, ప్రాంత ఉత్పత్తులు కొనుగోలుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జె.పద్మావతి సూచించారు. మంగళవారం స్థానిక ఉమామహేశ్వర నగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్నారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాల్లో ఆటవస్తువులను సొంతంగా తయారు చేసి పిల్లలకు ఇవ్వాలన్నారు. దీంతో పిల్లలు చిన్నతనం నుంచే దేశ, ప్రాంతీయ వస్తువులను కొనుగోలు చేసుకునేందుకు ఉత్సాహం చూపుతారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసు సౌజన్య, అంగన్వాడీ టీచర్లు, సహాయకులు, మహిళలు పాల్గొన్నారు.

**బ్రహ్మసముద్రం :** పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకుంటే ఆరోగ్యంతోపాటు మేథో అభివృద్ధి సాధ్యమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామాంజినమ్మ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బుడిమేపల్లి అంగన్వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పోషక విలువలు, ఆహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, మహిళలు ఆకుకూరలు, కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. అలాగే మునగాకు తింటే ఆరోగ్యమన్నారు. ఇకపోతే బిడ్డ పుట్టినప్పటి నుంచి ఎదుగుదలకు అవసరమైన పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే పిల్లల్లో మేథోశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సబితా, గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.


బ్రహ్మసముద్రం మండలంలో అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామాంజనమ్మ


గుంతకల్లులో అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మావతి

# బాధిత రైతుకు యూరియా పంపిణీ

## ప్రజాశక్తి వార్తకు స్పందన

**కళ్యాణదుర్గం టౌన్ :** జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశాలతో కళ్యాణదుర్గంలో బాధిత రైతుకు యూరియా పంపిణీ చేశారు. కళ్యాణదుర్గంలోని పలు ఎరువుల దుకాణాల్లో యూరియా కోసం 20 రోజులుగా తిరుగుతున్నా దొరకలేదని బ్రహ్మసముద్రం మండలం రాయలప్పదొడ్డి చెందిన రైతు సీనానాయక్ ఏడిఏ వసంతబాబుకు చేసుకున్న విన్నపంపై 'యూరియా ఇవ్వలేనప్పుడు పంట మీరే తొలగించండి' అని మంగళవారం ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన జెడిఎ కళ్యాణదుర్గం ఎడిఎ యల్లప్పతో మాట్లాడి బాధిత రైతులకు యూరియా ఇప్పించారు.

## యూరియా, డిఎపి అందజేత

**పుట్లూరు :** మండల కేంద్రంలోని రైతుసేవా కేంద్రంలో రైతులకు మంగళవారం యూరియా, డిఎపి ఎరువులను పంపిణీ చేసినట్లు ఎఒ కాత్యాయని తెలిపారు. మండలంలోని అన్ని డిబిటి ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఎరువులను పంపిణీ చేస్తున్న ఎఒ కాత్యాయని

# సమస్యల పరిష్కారానికి సచివాలయ ఉద్యోగుల నిరసన

**అనంతపురం కార్పొరేషన్ :** సమస్యలు పష్కరించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని నగరపాలక సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ జెఎసి నేతలు సుధాకర్, లక్ష్మీనారాయణ, మల్లికార్జున, చంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం సీనియార్టీ లిస్టు విడుదల చేసి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. అలాగే అరియర్స్ ఇవ్వాలని, ప్రొహిబిషన్ పిరియడ్‌లో కన్సాలిడేటెడ్ పే కింది పని చేసిన వారికి ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. అలాగే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థికపరమైన అన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి నేతలు, రామకృష్ణ, కిషోర్, ఆదినారాయణ, నాగేంద్ర, శిరీషా, మాధవి, సునీత, గిరిప్రసాద్, సాయిప్రతాప్, విజయ్, మల్లికార్జునరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

# ఎకరాకు 4 బస్తాల పప్పశనగ పంపిణీ చేయాలి

**అనంతపురం :** ఎకరాకు నాలుగు బస్తాల పప్పుపనగను సబ్సిడీతో రైతులకు పంపిణీ చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు గాజుల విరూపాక్షి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వజ్రకరూరు మండల వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్లరేగడి భూములున్న రైతులందరికీ ఎకరాకు నాలుగు బస్తాల చొప్పున ఇవ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90, మిగిలిన రైతులందరికీ 80 శాతం సబ్సిడీ, వికలాంగ రైతులందరికీ ఉచితంగా పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు చాబాల సుధాకర్, ప్రకాష్, షేక్షావలి, సిఐటియు నాయకులు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులపై దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు

## యూరియాపై ఆందోళన వద్దు : ఎడిఎ

**ప్రజాశక్తి-యల్లనూరు**

రైతులపై దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఎడిఎ ఎం.రవి స్థానిక సొసైటీ సిఇఒపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సహకార సంఘం సొసైటీలో ఎరువుల పంపిణీ సిఇఒపై చర్యలు తీసుకోవాలని జనసేన మండల కన్వీనర్ ఆదినారాయణ ఇచ్చిన పిర్యాదు మేరకు ఎడిఎ మంగళవారం స్థానిక సొసైటీ గోడైన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు శ్రమతో పోలిస్తే మన కష్టం చాలా చిన్నదన్నారు. అలాంటి రైతులపై దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. ఇకపోతే యూరియాపై రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలో తగినంత యూరియా సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎఇఒ మధు, జనసేన మండల కన్వీనర్ ఆదినారాయణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎడిఎ రవి

**మన గ్రోమోర్ దుకాణం తనిఖీ**

మండల కేంద్రంలోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని ఎడిఎ రవి తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పురుగు మందులు, ఆర్గానిక్, ఎరువులు, తదితర వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆర్గానిక్ పిచికారి మందులకు సంబంధించిన ఓపామ్స్ లేకుండా పలు పురుగు మందులు, విక్రయించరాదన్నారు. ఓ పామ్స్ లేనందున ఆర్గానిక్ పిచికారి మందులతో పాటు దుకాణంపై చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డిని ఆదేశించారు.

# నేరాలు ఘోరాలు

## మహిళ ఆత్మహత్య

**తాడిపత్రి రూరల్ :** పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మండల పరిధిలోని చుక్కలూరు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చుక్కలూరు గ్రామానికి చెందిన ప్రేమలత (50) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. గత కొంతకాలంగా కుటుంబంలో కలహాలు రావడంతో కొడుకు నుంచి వేరుగా ఉంటోంది. ఈనేపథ్యంలో మనస్థాపానికి గురై సోమవారం రాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం సవేరా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**తాడిపత్రి రూరల్ :** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలైన ఘటన మండల పరిధిలోని బుగ్గ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన అశ్వత్ సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై బుగ్గకి వెళ్లి తిరిగి వస్తుండగా గదరగుట్టపల్లి సమీపంలోకి రాగానే బుగ్గ తాడిపత్రి ప్రధాన రహదారిపై అదుపుతప్పి కింద పడి గాయపడ్డాడు. గమనించిన స్థానికులు గాయపడిన యువకుడిని స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## నాటుసారా, కర్నాటక మద్యం పట్టివేత

**కళ్యాణదుర్గంటౌన్ :** నియోజకవర్గంలో రెండుచోట్ల ఎక్సైజ్ ప్రొహిబిషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి నాటుసారా, కర్ణాటక మద్యాన్ని పట్టుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ, ఎస్ఐలు హరికృష్ణ, శంకర్‌నారాయణ, స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ సోమశేఖర్, ఎక్సైజ్ ఎస్ఐలు పీరునాయక్, వెంకటేష్, హెడ్‌కానిస్టేబుళ్లు నరసరాజు, ప్రతాప్ సంయుక్తంగా పట్టణంలోని మారెంపల్లి కాలనీలో తలారి పక్కీరప్ప కర్ణాటక టెట్రాప్యాకెట్లు అమ్ముతుండగా పట్టుకుని 48 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా పాలవాయి గ్రామంలో దాడులు చేసి బాలాజీనాయక్ నుంచి రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న కమిషనర్ దివాకర్‌రెడ్డి

## పి-4పై అవగాహన

**రాయదుర్గం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పి-4 (పబ్లిక్ ప్రయివేట్ పీపుల్ పార్ట్‌నర్ షిప్) కార్యక్రమంపై మున్సిపల్ సచివాలయ ఉద్యోగులకు మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పి-4కు సంబంధించి ప్రతి సచివాలయ సిబ్బంది విధి విధానాలను పాటించి నిర్ణీత కాల వ్యవధి లోపు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కిషోర్, పి-4 మాస్టర్ ట్రైనర్ నియోజకవర్గ విజన్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యంపై అవగాహన

**ప్రజాశక్తి-గుత్తి**

మండలంలోని వన్నేదొడ్డి గ్రామంలో మహిళల ఆరోగ్యంపై బేతాపల్లి పిహెచ్‌సి వైద్యాధికారులు దేవేంద్రనాయక్, ప్రవీణ్‌కుమార్ మంగళవారం అవగాహన కల్పించారు. స్వస్తి నారీ-స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, క్షయ వ్యాధి, మానసిక రోగాలపై వైద్యాధికారులు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో 106 మంది మహిళలకు వైద్యాధికారులు వివిధ రకాల పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ సుధారాణి, సూపర్‌వైజర్లు రెడ్డెమ్మ, లాజరస్, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మీకాంత, మాధవి, కవిత, లక్ష్మి, త్రివేణి, ఆంజనేయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు వినతి

**నార్పల :** మండల కేంద్రంలోని నడిబొడ్డున డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు అంబేద్కర్ సర్కిల్‌గా నామకరణం చేయాలని పలు దళిత సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాకే రామాంజనేయులు, ప్రభుదాస్, రామకృష్ణ, రామాంజనేయులు, కేశేపల్లి ఎర్నాగప్ప, మహిళలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నల్లలమ్మ విగ్రహ ప్రతిష్టాపన

**యల్లనూరు :** మండల పరిధిలోని గొడ్డుమర్రి గ్రామంలో మంగళవారం నల్లలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## రేణుకా యల్లమ్మకు ప్రత్యేక పూజలు

**ప్రజాశక్తి-శింగనమల**

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని సోదనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆగులూరప్ప స్వామి, రేణుకా యల్లమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారి ఆలయంలో కురుబ కాపుల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి, మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కురుబ కాపులు, ఆలయ పెద్దలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న గ్రామస్తులు

# గ్రామ పంచాయతీల పురోగతిపై శిక్షణ

**ప్రజాశక్తి-గుత్తి**

గ్రామ పంచాయతీల పురోగతిపై ప్రతి అధికారి అవగాహన కలిగి ఉండాలని ఎంపిపి జి.విశాలాక్షి, ఎంపిడిఒ డి.ప్రభాకర్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఎఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు గ్రామ పంచాయతీల పురోగతిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల విద్య, గ్రామాల్లో అక్షరాస్యత, ఆహార, ప్రజా పంపిణీ, వ్యవసాయశాఖ, ఆరోగ్యం, కుటుంబ సక్షేమం గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. జల జీవన్ మిషన్, ఎస్‌బిఎం, సాంఘిక సంక్షేమశాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ, శిశుసంక్షేమంపై అధికారులు నిత్యం పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రభుత్వంనుంచి అమలు అవుతున్న పథకాలు, అన్ని శాఖలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజా సంక్షేమం గురించి మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుని పథకాలు సమర్థవంతంగా అమలయ్యేలా చూడాలన్నారు. గ్రామాల అభివృద్ధిపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ ముస్తాక్‌అహ్మద్, ఎపిఒ రమేష్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎపిఎం అరుణకుమారి, కార్యదర్శులు బాషా, వెంకటేష్, ధనలక్ష్మి, సర్పంచులు కె.రమేష్‌బాబు, పాపన్న, బేడల లక్ష్మీదేవి, గురుమస్తాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**కళ్యాణదుర్గం టౌన్ :** గ్రామ పంచాయతీల అభివృద్ధిలో అందరూ కీలకమేనని ఎంపిపి మారుతమ్మ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి సూచికపై ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శంకర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ అంశాలపై అభివృద్ధి పనులపై వివరించారు. ఈసమావేశంలో వైస్ ఎంపిపి కాంతమ్మ, పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



పుట్లూరు మండలంలో శిక్షణ ఇస్తున్న అధికారులు

**పుట్లూరు :** పంచాయతీ పురోగతిపై మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒ శివప్రసాద్ ఆధ్వర్యంలో కార్యదర్శులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా పంచాయతీలను ఎలా అభివృద్ధి చేయాలి.. ఎలా సంపద సృష్టించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లావణ్య, హౌసింగ్ ఎఇ సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

**పామిడి :** గ్రామ పంచాయతీల పురోగతి, సుస్థిరత సాధించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ తేజోష్ణ సూచించారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచిక 1.0పై పంచాయతీ కార్యదర్శులు, మండల ఆఫీసర్లకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా పంచాయతీ సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు సాధించే దిశగా గ్రామ, మండల స్థాయిల్లో అభివృద్ధి ప్రగతికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ అశ్వర్థమ నాయుడు, ఎంపిపి బోగాతి మురళీమోహన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

**బొమ్మనహాల్ :** మండల పరిధిలోని ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధిపై సర్పంచులు, పంచాయతీల కార్యదర్శులకు మంగళవారం ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా ఎంపిడిఒ విజయభాస్కర్ పంచాయతీల అభివృద్ధి, ఆదాయం, నిధులు సేకరణ, తదితర వాటితో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**నార్పల :** మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఎంపిపి నాగేశ్వరరావు అధ్యక్షతన ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శేషారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పంచాయితీ రాజ్ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ బాలాజీ, వ్యవసాయ అధికారి చెన్న వీరస్వామి, విద్యాధికారి నారపరెడ్డి, ఉద్యానవనాధికారి నెట్టికంటయ్య, ఎంపిటిసిలు, రాజారెడ్డి, పద్మాకర్‌రెడ్డి, కాటమయ్య, శంకర్‌యాదవ్, సర్పంచులు సుప్రియ, కుళ్లాయిరెడ్డి, రామాంజనేయులు, రాంభూపాల్‌రెడ్డి, రామాంజనమ్మ, రాము, నాగన్న, నాగార్జున, రమణకుమారి, శివయ్య, వెంకటరమణమ్మ, సీనియర్ అసిస్టెంట్ సుభాహన్, జూనియర్ అసిస్టెంట్ రవీంద్రనాథ్‌రెడ్డి, టైపిస్టు జగన్నాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**డి.హీరేహాల్ :** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ దాసానాయక్ అధ్యక్షతన మంగళవారం పంచాయతీ అభివృద్ధిపై ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ధనుంజయ, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు :** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధిపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, మండల విద్యాశాఖ అధికారి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## పామిడిలో 'మ్యాజిక్ డ్రెయిన్ వర్క్'

**పామిడి :** పామిడి పామిడి మేజర్ పంచాయతీని మ్యాజిక్ డ్రెయిన్ ప్రాజెక్ట్‌గా చేపట్టేందుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపిడిఒ తేజోష్ణ, డిప్యూటీ ఎంపిడిఒ అశ్వర్థనాయుడు, ఎపిఒ ఆదినారాయణమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంజి ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద పైలెట్ ప్రాజెక్టుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సాధారణంగా 100 మీటర్ల రోడ్డుకు డ్రెయిన్ నిర్మించడానికి రూ.4 లక్షలు ఖర్చైతే మ్యాజిక్ డ్రెయిన్ కేవలం రూ.90 వేలతోనే పూర్తవుతుందన్నారు. ప్రతి ఇంటి నుంచి వచ్చే నీరు నిల్వ ఉండకుండా మ్యాజిక్ డ్రెయిన్ ఉపయోగపడుతుందన్నారు. నాలుగు లేయర్లుగా రాక్ అమర్చి దీన్ని నిర్మిస్తారన్నారు. ఈ వర్క్ చేయడానికి ఆసక్తి ఉన్నవారు ఈనెల 27వతేదీలోపు ఎంపిడిఒ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

## హుండీల లెక్కింపు

**నార్పల :** మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి హుండీల ఆదాయాన్ని ఆలయ అధికారుల సమక్షంలో లెక్కించారు. ఆంజనేయస్వామి హుండీలో రూ.9,46,873, పుల్లయ్య స్వామి కందకంలో 79.350కిలోల వెండి, రూ.20 వేల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకేతపురం శోభ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు హుస్సేనప్ప, గ్రామస్తులు పూజారి నరసిహులు, ఓబులేసు, రాజన్న, హరీష్, జాఫర్, రాజేష్‌పాల్గొన్నారు.

## 'గేట్స్'లో రక్తదాన శిబిరం

**గుత్తి :** స్థానిక గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం మానవతా బ్లడ్ డోనర్స్ సంస్థ ఆధ్వర్యంలో అనంతపురం ప్రభుత్వాసుపత్రి సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో కళాశాల విద్యార్థులు, సిబ్బంది దాదాపు 100 మంది రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వికె పద్మావతమ్మ, మానవత బ్లడ్ డోనర్స్ సంస్థ ప్రతినిధి అమర్నాథ్‌రెడ్డి, గుత్తి ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ యల్లప్ప, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

**రాయదుర్గం :** పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుల్లో నాలుగు నెలల ఉచిత శిక్షణకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వి.నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా చదివిన వారు తమ మార్కుల జాబితా నకళ్లు, రెండు పాస్‌పోస్టు సైజ్ ఫొటోలతో ఈనెల 30వ తేదీలోగా పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్..78010 31771ను సంప్రదించాలన్నారు.

## సకాలంలో ఎరువులు అందించాలని వినతి

**ప్రజాశక్తి-శింగనమల**



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మండలంలోని రైతులకు సకాలంలో జిప్సం, యూరియా అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల పరిధిలోని సలకంచెరువు రైతు సేవాకేంద్రంలో అగ్రికల్చర్ అధికారిణి జయంతికి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కొండారెడ్డి, శ్రీనివాసులు, సుంకన్న, రామకృష్ణ, పెద్దన్న, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## మాతాశిశు మరణాలను జరగనీయొద్దు : డిఎంహెచ్‌ఒ

**ప్రజాశక్తి-అనంతపురం**

జిల్లాలో ఎక్కడైనా మాతాశిశు మరణాలు సంభవిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈ.బి దేవి హెచ్చరించారు. ఆగస్టు మాసంలో జిల్లాలో జరిగిన మాతాశిశు మరణాలకు కారణాలపై మంగళవారం ఆ ప్రాంత డాక్టర్లు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతాశిశు నివారించాలని లేని పక్షంలో అందుకు కారకులను గుర్తించి తగిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా మాతృ మరణాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రమాదకార లక్షణాలు ఉన్న గర్భిణులను గుర్తించి వారి తల్లిదండ్రులకు సైతం అందుబాటులో ఉండి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మూఢనమ్మకాల వల్ల గర్భిణులు, పిల్లల ఆరోగ్యం ప్రమాదాల్లో పడుతోందన్నారు. వైద్యపరంగా ఎంతో అభిరుచి చెందిన ఈ రోజుల్లో కూడా మూఢనమ్మకాలు పాటించడం తగదన్నారు. కాగా ఆశాడే రోజున ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లీబిడ్డకు సంబంధించిన ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా యుగంధర్, మత్తు మందు నిపుణులు డాక్టర్ నవీన్‌కుమార్, చిన్నపిల్లల నిపుణులు డాక్టర్ రవికుమార్, స్త్రీవైద్య నిపుణులు డా.మల్లిక, డా.సౌజన్య డి పి హెచ్ ఎన్ ఓ ప్రమీలా దేవి ,హేమలత ఇతర సిబ్బంది పాల్గొన్నారు.